

ఎన్నికల కోడ్ వచ్చినా చిత్తూరు నగరం ప్రకాశం రోడ్డు, వేలూరు రోడ్డులో రాజకీయ పార్టీల హోర్డింగులు ఉన్నాయి. వీటిని కొందరు వ్యక్తులు సీ-విజిల్ యాప్ ద్వారా ఫొటోలు అప్‌లోడ్ చేశారు. అంతే.. నిమిషాల వ్యవధిలో అక్కడికి ఫ్లయింగ్ స్క్వాడ్ చేరుకుంది. స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుని యుద్ధ ప్రాతిపదికన హోర్డింగులను తొలగించింది. ఉల్లంఘనలపై 'సీ- విజిల్' యాప్ ఎంత వేగంగా పని చేస్తుందనేందుకు ఈ చర్యలే నిదర్శనం.

\- చిత్తూరు కలెక్టరేట్/వెదురుకుప్పం

విజిలేస్తే..

రంగంలోకి యంత్రాంగం

● అందుబాటులోకి 'సీ-విజిల్' యాప్ ● ఫిర్యాదు చేసిన 100 నిమిషాల్లో చర్యలు

సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్) అమల్లోకి వచ్చింది. ఈ ఎన్నికలు రాజకీయ పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారడంతో అక్రమాలకు, నిబంధనల ఉల్లంఘనలకు అవకాశాలున్నాయి. ప్రజా భాగస్వామ్యంతో వీటికి 'చెక్' పెట్టడానికి కేంద ఎన్నికల సంఘం 'సీ- విజిల్' యాప్‌ను తీసుకొచ్చింది. ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘించినా, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా, మద్యం, డబ్బు, వస్తుసామగ్రి వంటివి పంపిణీ చేసినా ఈ యాప్ ద్వారా ఫొటోలు, వీడియోలు తీసి అప్‌లోడ్ చేస్తే చాలు. నేరుగా ఎన్నికల సంఘానికి చేరిపోతాయి. కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టేలా చేసే ప్రసంగాలను ఆడియో ద్వారా రికార్డుచేసి అప్‌లోడ్ చేయవచ్చు.

అత్యంత వేగంగా స్పందన

సీ-విజిల్ యాప్ ద్వారా చేసిన ఫిర్యాదులపై అత్యంత వేగంగా స్పందన ఉంటుంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినా, ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నా సంబంధిత ప్రదేశం నుంచే ఫొటోలు, వీడియోలు, ఆడియోలను యాప్‌లో అప్‌లోడ్ చేయవచ్చు. అప్‌లోడ్ చేసిన గంటలోపు అక్కడికి ముగ్గురు సభ్యులతో కూడిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం చేరుకుంటుంది. ఘటనపై 90 నిమిషాల్లో ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తారు. ఎన్నికల కమిషన్ అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ యాప్‌ను ఓటర్లు వినియోగించుకోవాలి.

\- శ్రీనివాసులు, ఆర్వో (జేసీ), చిత్తూరు అసెంబ్లీ

వంద నిమిషాల వ్యవధిలో..

- ఎవరైనా, ఎక్కడినుంచైనా యాప్‌లో అప్‌లోడ్ చేసిన ఐదు నిమిషాల్లో జిల్లా ఎన్నికల అధికారికి చేరుతుంది. ఆయన దానిని పరిశీలనకు క్షేత్రస్థాయిలో ఉన్న బృందాలకు పంపిస్తారు.
- 15 నిమిషాల్లో క్షేత్రస్థాయిలో ఉన్న ఫ్లయింగ్ స్క్వాడ్ ఘటనా స్థలానికి చేరుతుంది.
- 30 నిమిషాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ చర్యలు మొదలుపెట్టి నివేదికను ఉన్నతాధికారులకు పంపుతుంది.
- 50 నిమిషాల్లో రిటర్నింగ్ అధికారులు ఫిర్యాదును మూసివేస్తారు.
- ఇలా ప్రతి ఫిర్యాదుకు వంద నిమిషాల్లో ప్రతిస్పందన ఉంటుంది.

ఈ యాప్.. మీ చేతుల్లో ఇలా..

- యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- ఇన్‌స్టాల్ చేసుకునే సమయంలో రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గాన్ని ఎంచుకోవాలి.
- ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్ చేయాలనుకున్న సమయంలో మొబైల్‌లోని జీపీఎస్‌ను ఆన్‌లో ఉంచాలి. దాని ఆధారంగానే సంబంధిత ప్రాంతానికి నేరుగా అధికారులు చేరుకోగలుగుతారు.
- యాప్ ఇన్‌స్టాల్ చేసుకునే సమయంలో వచ్చిన ఓటీపీ ద్వారా యాప్ యాక్టివేట్ అవుతుంది.
- ఆ తర్వాత వీడియోలు, ఫొటోలు అప్‌లోడ్ చేసి, నేరుగా యాప్ ద్వారా ఉన్నతాధికారులకు పంపవచ్చు.
- పాత ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్ కావు. అప్పటికప్పుడు తీసినవి మాత్రమే అప్‌లోడ్ అవుతాయి. ఎన్నికల కోడ్ అమలు నాటి నుంచి ఈ యాప్ అమల్లో ఉంది.

'కోడ్' కూసినా..

ఎన్నికల కోడ్ ఈనెల 16వ తేదీన అమల్లోకి వచ్చింది. 24 గంటల్లో ప్రభుత్వ, ప్రైవేటు భవనాలకున్న రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, రంగులు తొలగించాలి. కానీ, చాలాచోట్ల ప్రభుత్వ కార్యాలయాలకు రంగు మారలేదు. అధికారులూ పట్టించుకోవడంలేదు. ఫిర్యాదులొస్తే మాత్రం రంగు మారుస్తున్నారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా రాజకీయ పార్టీల ప్రచారాల్లో పాల్గొంటున్న వలంటీర్లు, కాంట్రాక్టు ఉద్యోగులపై వేటు పడుతున్నా వారి తీరు మారడంలేదు. మా దారి మాదే అంటూ అధికార పార్టీతో అంటకాగుతూ ప్రచారంలో తిరుగుతున్నారు.

మారని రంగు



గంగాధరనెల్లూరు మండలం బుక్కా పట్నం పంచాయతీ రెడ్డిపల్లెలో రైతు భరోసా కేంద్రానికి ఇప్పటికీ అలాగే ఉన్న వైసీపీ రంగులు



ఇది జీడీనెల్లూరు మండలం తూగుండ్రంలో కొన్నేళ్ల కిందట నిర్మించిన తాగునీటి ట్యాంకు. దీనికి ఎన్నికల కోడ్ నాలుగైదు రోజుల్లో వస్తుందనగా వైసీపీ రంగులు వేశారు.

\- గంగాధరనెల్లూరు



ఇది పెనుమూరు మండలం రామక్రిష్టాపురం సచివాలయ పరిధిలో చిప్పారపల్లిలో రోడ్డుపక్కనే ఉన్న ఆర్బీకే భవనం. ఇప్పటికీ వైసీపీ రంగులు తొలగించడంపై విమర్శలు వస్తున్నాయి. - పెనుమూరు

ఇది కార్వేటినగరం మండలం డీఎం పురంలోని రైతు భరోసా కేంద్రం. కోడ్ వచ్చి వారం రోజులైనా వైసీపీ రంగులు తొలగించకపోవడంపై ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.

\- కార్వేటినగరం





పూతలపట్టు మండలం చిత్తూరు- కడప జాతీయ రహదారిలోని రైతు భరోసా కేంద్రం ఇప్పటికీ వైసీపీ రంగులతో దర్శనమిస్తోంది. ఇది కోడ్ ఉల్లంఘన కాదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. - పూతలపట్టు



గుడిపాల మండలం శ్రీరంగంపల్లి పంచాయతీలో హైస్కూల్ వద్ద నిర్మించిన నీళ్ల ట్యాంకుకున్న వైసీపీ రంగులపై పెయింటింగ్ వేయాలని ఐదు రోజుల కిందటే ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. కానీ స్థానిక అధికారులు పట్టించుకోలేదు.

\- గుడిపాల



వైసీపీ రంగుల పిచ్చి బంగారుపాళ్యం మండలం కొదలమడుగులోని డంపింగ్ యార్డునూ వదల్లేదు. కోడ్ వచ్చినా ఈ రంగులను అధికారులు మార్చలేదు.

\- బంగారుపాళ్యం





కుప్పం మండలం నడిమూరు పంచాయతీ హంసాపురం గ్రామంలో వలంటీర్లు శివరాజు, మణి శుక్రవారం రాత్రి వైసీపీ ఎంపీపీ అశ్వినితో కలిసి ప్రచారంలో పాల్గొన్నట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఫొటోలను టీడీపీ వర్గాలు వైరల్ చేయడంతో పాటు అధికారులకు ఫిర్యాదు చేశారు. - కుప్పం

మేమింతే!



వలంటీర్ అశోక్‌రెడ్డికి డిప్యూటీ సీఎం సన్మానం - డిప్యూటీ సీఎంను సత్కరిస్తున్న వలంటీర్ గోవర్ధన్‌రెడ్డి

శ్రీరంగరాజపురం మండలం వేణుగోపాలపురం పంచాయతీలో శుక్రవారం డిప్యూటీ సీఎం నారాయణస్వామి చేపట్టిన ఎన్నికల ప్రచారంలో వలంటీరు వి.అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన్ను డిప్యూటీ సీఎం గజమాలతో సన్మానించారు. అదే గ్రామానికి చెందిన బి.గోవర్ధన్‌రెడ్డి అనే వలంటీరు డిప్యూటీ సీఎం నారాయణస్వామిని సత్కరించారు. వీరిపై ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసినట్లు జనసేన ఇన్‌చార్జి పొన్న యుగంధర్ తెలిపారు.

\- శ్రీరంగరాజపురం

వేటు పడింది



ముగ్గురు వలంటీర్ల తొలగింపు

సదుం మండలం ఊటుపల్లెలో నెల 19వ తేదీన వైసీపీ బైక్ ర్యాలీలో వలంటీర్లు బి.గురుమూర్తి, ఎం.ఈశ్వరయ్య, కె.బాలాజీ పాల్గొన్నారు. తమకు అందిన ఫిర్యాదుపై అధికారులు విచారణ జరిపి ఆ ముగ్గురినీ తొలగించినట్లు ఎంపీడీవో రాజశేఖర్‌బాబు తెలిపారు.

\- సదుం

పుంగనూరు వెలుగు సీసీ సస్పెన్షన్

వైసీపీ కండువా కప్పుకొని ఎన్నికల ప్రచారం చేసిన పుంగనూరు వెలుగు కమ్యూనిటీ కోఆర్డినేటర్ ఎస్.గంగాధర్‌ను శనివారం డీఆర్‌డీఏ పీడీ తులసి సస్పెండ్ చేశారు. ఎన్నికల సంఘానికి టీడీపీ చేసిన ఫిర్యాదు నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టారు.

\- పుంగనూరు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

రంగు మారింది


ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా కొన్ని ప్రభుత్వ భవనాలకు వైసీపీ రంగులే ఉన్నాయి. ఈ రంగుల్ని ఏం చేస్తారంటూ 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పెనుమూరు మండలం సామిరెడ్డిపల్లె సచివాలయ పరిధి ఉగ్రాణంపల్లిలోని ఆర్బీకే భవనానికి ఉన్న రంగులను మార్చారు.

\- పెనుమూరు



ఆర్బీకే భవనానికి ఉన్న వైసీపీ రంగులపై పెయింటింగ్ వేయించిన అధికారులు

రేపు, ఎల్లుండి చంద్రబాబు కుప్పం పర్యటన



కుప్పం, మార్చి 23: తెలుగుదేశం పార్టీ అధినేత, స్థానిక ఎమ్మెల్యే చంద్రబాబు సోమ, మంగళవారాల్లో సొంత నియోజకవర్గమైన కుప్పంలో పర్యటించనున్నారు. ఈ మేరకు ఆయన పర్యటన ఖరారైంది. సోమవారం ఉదయం 11 గంటలకు హెలికాప్టర్‌లో కుప్పంలోని పీఈఎస్ వైద్య కళాశాలలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ్నుంచి కుప్పంలోని టీడీపీ కార్యాలయానికి చేరుకుని మధ్యాహ్నం 2 గంటల వరకు నాయకులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 3.30 గంటలకు కుప్పం ఆర్టీసీ బస్టాండు సర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహం ఎదుట జరిగే బహిరంగ సభలో పాల్గొని ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తారు. ఈ సభ సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగుతుంది. అక్కడ్నుంచి ఏవీఆర్ కల్యాణ మండపానికి చేరుకుని 6- 7 గంటల మధ్య ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొంటారు. అనంతరం టీడీపీ కార్యాలయానికి చేరుకుని 7.30 నుంచి రాత్రి 8.30 గంటలదాకా నాయకులతో సమావేశమవుతారు. అనంతరం ఆర్ అండ్ బి గెస్ట్‌హౌస్ చేరుకుని రాత్రి బస చేస్తారు.

● మంగళవారం ఉదయం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి బయలుదేరి 11 గంటలకు కేవీఆర్ కల్యాణ మండపానికి చేరుకుంటారు. పార్టీలో చేరే వారిని కండువాలు కప్పి ఆహ్వానిస్తారు. అనంతరం కుప్పంలో ఇంటింటి ప్రచారంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30 గంటలకు టీడీపీ కార్యాలయానికి చేరుకుని 3.30 గంటలదాకా పార్టీ నేతలతో సమావేశమవుతారు. ఆ తర్వాత రామకుప్పం మండలం రాజుపేట గ్రామం వద్ద హంద్రీ-నీవా కాలువను సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటలదాకా పరిశీలిస్తారు. 6 గంటలకు తిరిగి కుప్పంలోని పార్టీ కార్యాలయానికి చేరుకుని 7.45 గంటలదాకా నేతలతో సమావేశమవుతారు. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో బస చేస్తారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆదివారం): సా. 6.29
సహరి (సోమవారం) : ఉ. 4.24



ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతున్న అమర్

27న పలమనేరులో ప్రజాగళం

పలమనేరు, మార్చి 23: పలమనేరులో ఈనెల 27వ తేది తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రజాగళం యాత్ర జరగనుందని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఇక్కడి టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ కార్యక్రమం ఇక్కడ ప్రారంభం కానుండటం నియోజకవర్గ ప్రజలకు ఒక సువర్ణ అవకాశమని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ దీని సద్వినియోగం చేసుకొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. పరజాగళం సందర్భంగా నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసే గ్రీవెన్స్ సెల్‌లో ప్రజలే లిఖిత పూర్వకంగా చంద్రబాబు సమక్షంలో తెలియజేసేందుకు అవకాశం ఉందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక వందరోజుల్లో పూర్తి చేయాలన్నదే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.

624 తుపాకుల స్వాధీనం

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 23: ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో లైసెన్స్ కలిగిన 697 తుపాకుల్లో.. స్థానిక పోలీసు స్టేషన్ల ద్వారా 624 డిపాజిట్ చేయించారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ శనివారం తెలిపారు. మిగిలిన 73 తుపాకులకు సంబంధించి బ్యాంకుల్లో పనిచేసే సెక్యూరిటీ గార్డులు, ఏటీఎం కేంద్రాలకు డబ్బులు తీసుకెళ్లే సెక్యూరిటీ ఏజెన్సీ వారికి మినహాయింపు ఇచ్చామన్నారు.

నీటి పరిస్థితిపై వారంలో నివేదిక ఇవ్వాలి


వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నీటి ఎద్దడిపై సమీక్ష చేస్తున్న కలెక్టర్ షన్మోహన్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 23: రానున్న నెల రోజుల పాటు జిల్లాలో ఎలాంటి తాగు నీటి ఎద్దడి లేకుండా చూడాలని, నీటి ఎద్దడి తలెత్తితే వాటిని పరిశీలించి ప్రతిపాదన రూపొందించాలని కలెక్టర్ షన్మోహన్ అన్నారు. శనివారం ఆయన తనక్యాంపు కార్యాలయం నుంచి ఎంపీడీవోలు, ఏఈలు, ఇతర నీటి సరఫరాల వ్యవస్థ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలుచేపట్టాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. చెరువుల్లో, గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థకు సంబంధించిన వనరుల్లో ప్రస్తుతమున్న నీటి పరిస్థితి, నెల రోజుల వరకు చేపట్టాల్సిన చర్యల గురించి నివేదిక ఇవ్వాలన్నారు. గ్రామీణ, పట్టణ నీటిసరఫరాకు సంబంధించిన పైపులైన్లు, ఇతరత్రా వాటి మరమ్మతులు అవసరమైన అంచనాలు రూపొందించాలన్నారు. నీటి సరఫరాల వ్యవస్థకు తప్ప ఇతరత్రా అవసరాలకు ఎక్కడైనా నీరందిస్తుంటే దాన్ని నిలుపుదల చేయాలన్నారు. జిల్లాలో ఉన్న 4122 చెరువుల్లో నీటి నిల్వల పరిస్థితిలపై సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి జడ్పీ సీఈవో గ్లోరియా, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రామయ్య, ఇరిగేషన్ ఈఈ నాగభూషణం, డీపీవో లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షల్లో ముగ్గురి డీబార్

చిత్తూరు (సెంట్రల్), మార్చి 23: చిత్తూరులోని సోషియల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో శనివారం జరిగిన టెన్త్ ఫిజికల్ సైన్స్ పరీక్షల్లో ముగ్గురిని డీబార్ చేసినట్లు జిల్లా పరిశీలకుడు మస్తానయ్య తెలిపారు. ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణ సరిగా లేదని.. సెంటర్ల నిర్వాహకులపై దృష్టి సారించినట్లు తెలిపారు. చిత్తూరులోని కన్నన్ స్కూల్, గిరింపేట మున్సిపల్ స్కూల్ సెంటర్లలోని చీఫ్ సూపరింటెండెంట్లను మార్చి వేసినట్లు తెలిపారు. కాగా, శనివారం జరిగిన పరీక్షల్లో 21,767 మంది విద్యార్థులకు గాను 21,210 మంది హాజరు కాగా, 557 మంది గైర్హాజరైనట్లు డీఈవో దేవరాజు, పరీక్షల సహాయ కమిషనర్ చాముండేశ్వరి తెలిపారు.

రూ.3 లక్షల నగదు పట్టివేత.. అప్పగింత


నగదు వివరాలను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

వి.కోట, మార్చి 23: ఆంధ్రా- తమిళనాడు సరిహద్దులోని నాయకనేరి చెక్‌పోస్టు వద్ద రూ.3లక్షల నగదును శనివారం పట్టుకున్నారు. బోయచిన్నాగనపల్లెకు చెందిన గుణశేఖర్ టెంపోను వి.కోట పోలీసులు తనిఖీ చేయగా.. రూ.3 లక్షల నగదు పట్టుబడింది. 20 మంది రైతుల పేర్లతో మార్కెట్‌కు సంబంధించిన బిల్లులు ఉండడంతో ఆ నగదును తిరిగి అతడికే అప్పగించారు.


విజయవాడలో జరిగిన వర్క్‌షాప్‌కు హాజరైన జిల్లా నాయకులు

టీడీపీలో జోష్

- ఇప్పటికే ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులపై స్పష్టత
- తాజాగా వారికి చంద్రబాబు దిశానిర్దేశం

చిత్తూరు, మార్చి 23 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలో కొత్త జోష్ నెలకొంది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు రెండు విడతల్లో అభ్యర్థులను ఖరారు చేసిన టీడీపీ అధిష్ఠానం, తాజాగా చిత్తూరు ఎంపీ అభ్యర్థిని కూడా ప్రకటించింది. దీంతో పాటు అభ్యర్థులతో చంద్రబాబు విజయవాడలో శనివారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో దిశానిర్దేశం చేశారు. చిత్తూరు పార్లమెంటు పార్టీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, పార్లమెంటు పరిధిలోని ఎమ్మెల్యే అభ్యర్థులు పులివర్తి నాని, గురజాల జగన్మోహన్, గాలి భానుప్రకాష్, మురళీమోహన్, థామస్ తదితరులు జిల్లా నుంచి హాజరయ్యారు. సోమవారం నుంచి కుప్పం, పలమనేరులో చంద్రబాబు పర్యటన ఉన్న నేపథ్యంలో ఆ నియోజకవర్గాల నాయకులు హాజరుకాలేదు. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ టీడీపీ జోరుగా జనంలోకి వెళ్తోంది.

వేవ్ ఉందని నిర్లక్ష్యం వద్దు

టీడీపీ, జనసేన, బీజేపీ వేవ్ ఉందని, సులువుగా గెలిచి పోతామనే నిర్లక్ష్యం వద్దు.. మరింత శ్రమించాలి. మిత్రపక్షాలతో సమన్వయం ముఖ్యం. వైసీపీ నేతల తప్పులను ఎప్పటికప్పుడు ఎత్తి చూపించండి. కోడ్ ఉల్లంఘనల మీద సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయండి. మన న్యాయవాద బృందాల సేవలను వినియోగించుకోండి.

- జిల్లా అభ్యర్థులు, నేతలతో చంద్రబాబు

- కుప్పం నియోజకవర్గంలో టీడీపీ అధినేత చంద్రబాబుకు ఈసారి లక్ష మెజార్టీ లక్ష్యంగా ఎన్నికల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో శ్రేణులు శ్రమిస్తున్నారు. మంత్రి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ వ్యూహాలను ఎప్పటికప్పుడు ఎదుర్కొంటున్నారు. ఆ మధ్య సీఎం జగన్ హంద్రీనీవా నీళ్లను వదిలిన తీరు వెనుక నిజాలను బయటపెట్టి ఇదంతా డ్రామా అని టీడీపీ నేతలు నిరూపించారు.
- పలమనేరులో మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా ఒకటికి రెండుసార్లు ఇంటింటి ప్రచారం చేశారు. వైసీపీ తరపున మళ్లీ వెంకటేగౌడకు టికెట్ రావడం టీడీపీకి అనుకూలిస్తుందని అమర్ వర్గం భావిస్తోంది.
- పూతలపట్టు నియోజకవర్గంలో ఈసారి ఎలాగైనా టీడీపీ జెండా ఎగరేయాలని పార్టీ శ్రేణులు కంకణం కట్టుకున్నారు. అభ్యర్థి మురళీమోహన్ పార్టీలో సీనియర్లను కలుపుకొని పోతున్నారు. పార్టీకి దూరంగా ఉన్నవారిని మళ్లీ ఆహ్వానించి గెలిపించాలంటూ కోరుతున్నారు.
- జీడీనెల్లూరులో అనేకమార్లు వైసీపీ తమ అభ్యర్థిని మార్చడం, వైసీపీలో వర్గాలు ఉండడం టీడీపీకి అనుకూలించే అంశాలు. ఇక్కడ టీడీపీ అభ్యర్థి థామస్ ప్రచారంలో దూసుకుపోతున్నా..పార్టీలో సీనియర్లను కలుపుకొని పోవడం లేదని, తద్వారా చాలామంది పార్టీకి దూరంగా ఉంటున్నారని తెలుస్తోంది.
- చిత్తూరులో గురజాల జగన్మోహన్‌ను గెలిపించుకునేందుకు మిత్రపక్షాల నాయకులంతా సిద్ధమయ్యారు. వైసీపీ అభ్యర్థి, ఎర్రచందనం స్మగ్లర్ విజయానందరెడ్డిని ఎలాగైనా ఓడించాలని చిత్తూరు పాలనలో ముద్ర వేసిన రాజకీయ కుటుంబాలన్నీ ఏకమయ్యాయి.
- పుంగనూరులో టీడీపీ శ్రేణులు కసి మీద ఉన్నారు. మంత్రి పెద్దిరెడ్డి ఈ ఐదేళ్లలో చేసిన అక్రమాలతో పాటు తమను అక్రమ కేసులతో వేధించిన తీరును గుర్తు చేసుకుంటున్నారు. చల్లా రామచంద్రారెడ్డిని గెలిపించుకోవాలని శ్రమిస్తున్నారు. ఇక్కడ బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్ కూడా గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉంది.
- నగరిలో రోజా మీద ప్రజల్లో ఉన్న వ్యతిరేకతతో పాటు సొంత పార్టీ నాయకులు కూడా ఆమె కోసం పనిచేయబోమని బహిరంగంగా చెబుతుండటం టీడీపీకి అనుకూలించే అంశాలు. దీనికితోడు భానుప్రకాష్ తండ్రి ముద్దుకృష్ణమనాయుడిని తలపిస్తూ గ్రామాల్లో తిరుగుతున్నారు.
- చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు ఇప్పటికే ఏడు నియోజకవర్గాల్లో అభ్యర్థులతో కలిసి పర్యటిస్తున్నారు. ఉన్నతస్థాయి అధికారిగా పనిచేసిన ఈయన అందరినీ సమన్వయం చేసుకుంటూ సాగుతున్నారు. 1984 నుంచి 2019 వరకు పదిసార్లు చిత్తూరు లోక్‌సభకు ఎన్నికలు జరగ్గా ఏడుసార్లు టీడీపీ, రెండుసార్లు కాంగ్రెస్, ఓ సారి వైసీపీ గెలిచింది.

ఆ ఇద్దరే నా భర్తను చంపేశారు

- వన్ టౌన్ పోలీసు స్టేషన్ వద్ద భార్య, బంధువుల ధర్నా
- అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు
- అనుమానితులను విచారిస్తున్న పోలీసులు


వన్‌టౌన్ స్టేషన్ వద్ద ధర్నాలో రోదిస్తున్న మృతుడి కుటుంబీకులు, బంధువులు



స్టేషన్ వద్ద కుప్పకూలిన మృతుడి భార్య, తల్లి - సుధాకర్ (ఫైల్ ఫొటో)

చిత్తూరు, మార్చి 23: మినీ లారీ వాహన యజమాని, ఆటో డ్రైవర్ కలిసి తన భర్తను చంపేశారని మంజుల ఆరోపించారు. అతడు డ్రైవింగ్‌కు వెళ్లగా.. శవాన్ని ఆటోలో ఇంటికి తీసుకొచ్చారని, అనుమానం వచ్చి ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే చనిపోయినట్లు డాక్టర్లు చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త మృతికి కారణమైన ఆ ఇద్దరిపై చర్యలు తీసుకోవాలంటూ చిత్తూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట శనివారం కుటుంబీకులు, బంధువులతో కలిసి ఆమె ధర్నా చేశారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. జీడీనెల్లూరు మండలం పాచిగుంట దళితవాడకు చెందిన సుధాకర్(42) నాగరాజు వద్ద మినీ లారీ డ్రైవరుగా కొన్నేళ్లుగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో బాడుగకు వెళ్లిన సుధాకర్ శనివారం కొంగారెడ్డిపల్లె వద్ద రోడ్డు పక్కనే వాహనాన్ని ఆపి మద్యం తాగారు. ఆ మత్తులో అలాగే పడుకుని ఉండిపోవడంతో వాహన యజమాని నాగరాజు వెతుక్కుంటూ అక్కడికి వచ్చారు. మద్యం మత్తులో లారీలోనే పడుకుని ఉన్న సుధాకర్‌ను చూసి.. మృతుడికి వరుసకు బావమరిది అయిన ఆటో డ్రైవర్ రఘుకు ఫోన్ చేసి పిలిపించారు. సుధాకర్‌ను ఆటోలో తీసుకెళ్లి ఇంటి వద్ద వదిలేయాలని చెప్పారు. దాంతో తన ఆటోలో అతడిని పాచిగుంటకు తీసుకెళ్లారు. ఇంటి వద్ద మృతుడి భార్య లేపినా సుధాకర్ లేవకపోవడంతో సమీపంలోని తూగుండ్రం ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి.. అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దాంతో మృతుడి బంధువులు చిత్తూరు ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద స్థితిలో మృతిగా వన్‌టౌన్ ఎస్‌ఐ షేక్షావలి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని సీఐ విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. కాగా మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కాగా, ఈ ఘటనకు సంబంధించి మృతుడి కుటుంబీకులు, బంధువులు వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వద్ద ధర్నాకు దిగారు. 'నా భర్త సుధాకర్‌ను వాహన యజమాని నాగరాజు చంపేశాడు. నా భర్తకు, ఓనర్‌కు మధ్య కొంతకాలంగా తగాదా ఉంది. ఈ తగాదా కారణంగానే చంపేసి ఉంటాడు. చంపేసిన తరువాత బంధువైన రఘు ఆటోలో ఇంటికి పంపించాడు. ఈ వ్యవహారంలో రఘుకు కూడా సంబంధం ఉంది' అంటూ మృతుడి భార్య మంజుల ఆరోపించారు. పోలీసులు పూర్తి స్థాయిలో విచారించి తన కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.


గంగాధరనెల్లూరు హైస్కూల్ మలుపు వద్ద లైట్ల వెలుతురులో వస్తున్న వాహనదారులు

మంచు కురిసే.. ఎండాకాలం!

ఎండాకాలం.. తెల్లవారుజామున పొగమంచు కప్పేస్తోంది. గంగాధరనెల్లూరు మండలంలో శనివారం తెల్లవారుజాము నుంచి ఉదయం 7గంటలకు వరకు పొగమంచు కప్పుకోవడంతో వాహనదారులు లైట్ల వెలుతురులోనే రాకపోకలు సాగించారు. ఆ తర్వాత మధ్యాహ్నం ఎండ తీవ్రంగా మారింది. మధ్యాహ్నం 12 నుంచి 2.30 గంటల వరకు రహదారుల్లో రాకపోకలు లేక నిర్మానుష్యంగా కనిపించాయి.

- గంగాధరనెల్లూరు


మోతరంగనపల్లె వద్ద..

కోడ్‌ను కట్టుదిట్టంగా అమలు చేయాలి

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 23: జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి కట్టుదిట్టంగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత నోడల్ ఆఫీసర్లపై ఉందని ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ అన్నారు. శనివారం ఎంపీడీవోలు, నోడల్ అధికారులు, ఇతర అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేటు స్థలాల్లో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న చిన్నపాటి ప్రచార సామగ్రికి అనుమతి ఉంటుందని, శాశ్వత ఏర్పాటుకు అనుమతి ఉండదని చెప్పారు. ప్రవర్తన నియమావళిని ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో రాతలు, కటౌట్లు, బ్యానర్లు ఉంటే తొలగించి నియమావళిని అమలు చేయాలని కోరారు.

బోనమందకు చేరిన ఏనుగులు

సోమల, మార్చి 23: సోమల మండలంలోని పేటూరు పంచాయతీ బోనమంద పొలాల్లో ఏనుగులు సంచరించినట్లు ఆ ప్రాంత రైతులు శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి ఆవులపల్లె పంచాయతీలోని పత్రపల్లె, కొత్తూరు మీదుగా రైతుల పొలాల్లో వరి, టమోటా, మామిడి తోటల్లో పంటలను ధ్వంసం చేసి రెడ్డివారిపల్లె మీదుగా బోనమంద వైపు వెళ్లాయి. ఈ మార్గంలోని పొలాల్లో పైపులు, విద్యుత్ మోటర్లను ధ్వంసం చేసినట్లు రైతులు వాపోయారు. సుమారు 16 ఏనుగుల గుంపు సంచరించినట్లు రైతులు తెలిపారు.

టీడీపీ నేత నానీకి తప్పిన ప్రమాదం

చంద్రగిరి, మార్చి 23: చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ప్రయాణిస్తున్న కారును గుంటూరు సమీపంలో వెనుక నుంచి ఓ టిప్పర్ ఢీకొంది. శనివారం విజయవాడలో జరిగే టీడీపీ సమావేశానికి నాని వెళుతుండగా జరిగిన ఈ ప్రమాదంలో కారు పాక్షికంగా దెబ్బతింది.కారులో ఉన్న తమకేం జరగలేదని నానీ తెలిపారు.ఆయన ప్రమాదం నుంచి బయటపడ్డారని తెలిసి టీడీపీ బీసీసెల్ ఉపాధ్యక్షుడు సుబ్బుయాదవ్ ఆధ్వర్యంలో మంగళంలోని సప్తగిరికాలనీ టీడీపీ నాయకులు శివాలయంలో 51 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.రామ్మూర్తి యాదవ్, అల్లాబాషా, హరికృష్ణ, గోపాల్ యాదవ్, చెరుకూరి కిషోర్, నందిమంగళం గోపి, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



ఈ చారెడు నీళ్లయినా మిగలతాయో లేదో | అడుగంటిన మడుగులో బాతులు

ఏమి ఎండలు సామీ!

ఎంత గజరాజైనా... నీటిమడుగులో ఒళ్లు తడుపుకుంటున్న ఏనుగులు



నడిఎండ వేళ జింకల అవస్థలు

వేసవి వేడిసెగల తాపంతో తిరుపతి జూపార్క్ లోని జంతుజాలం హడలిపోతోంది. అడవిలో అయితే నీడనూ, నీటి జాడలనూ వెతుక్కుంటూ వెళ్లిపోతాయి. జూలో వీటి సంరక్షణకు సిబ్బంది శ్రమిస్తున్నారు.జూపార్కులో సింహాలు 14, తెల్ల పులులు 10, బెంగాల్ టైగర్స్ 6, చిరుతలు 5, జాగ్వర్స్ 2, ఏనుగులు 5 ఉన్నాయి. నిరంతరం నీటితో వాటి ఆవాసాలను తడుపుతున్నారు.పులులు, చిరుతలు, జాగ్వర్ లుండే ఎన్‌క్లోజర్ల మీద పచ్చ తివాచీలు కప్పి వేడిని తగ్గిస్తున్నారు. పులులున్న నైట్ హౌస్ లోపల వట్టివేర్ల చాపలు వేలాడదీసి, కూలర్లను ఏర్పాటు చేశారు. పక్షుల ఎన్‌క్లోజర్ల మీద నీటిని పిచికారీ చేస్తున్నారు. వీటి చుట్టూ పచ్చతెరలు కట్టి తడుపుతున్నారు. ఇక జింకలు, నీటి ఏనుగు, తాబేళ్లు, బాతులు, కొంగలు, అడవి పందులు, అడవి దున్నలు, హైనాలు, రేసుకుక్కలుండే తావుల్లో నీటి గుంతలు ఏర్పాటు చేశారు. కళ్యాణిడ్యాం నీటితో పాటూ 10బోర్లు నిరంతరం నీటిని అందిస్తున్నాయి. మొత్తానికి వనాలకు దూరమైన ఈ జీవుల ప్రాణాలను కాపాడడానికి వేసవిలో జూపార్క్ సిబ్బంది ఒక యుద్ధమే చేస్తారు.

- మంగళం

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



మృతుడు శ్రీనివాసులు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం, మార్చి 23: కుప్పం పుర పాలక సంఘం 17వ వార్డులో టీడీపీ కార్యకర్త శ్రీనివాసులు అకాల మరణం చెందారు. పార్టీ నియోజక వర్గ ఇన్‌ఛార్జి పీఎస్. మునిరత్నం ఆధ్వర్యంలో నాయకులు శనివారం ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మట్టి ఖర్చులకుగాను చంద్రబాబు తరఫున రూ.10 వేలు మృతుని కుటుంబసభ్యులకు అందించారు. అలాగే కుప్పం మండలంలోని మంకలదొడ్డి గ్రామంలో పాపమ్మ అనే వృద్ధురాలు మృతి చెందితే ఆమెకు నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థికసాయం చేశారు. ఈ కార్యక్రమాల్లో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలతోనే విలువల స్థాపన



సంప్రదాయ వస్త్రధారణలో హాజరైన కేఈసీ విద్యార్థులు, అధ్యాపకులు

కుప్పం, మార్చి 23: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు విద్యార్థులకు నేర్పడంవల్ల వారిలో విలువలను స్థాపించవచ్చని బీసీఎన్ విద్యా సంస్థల అధినేత బీసీ.నాగరాజ్ అన్నారు. కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం సంప్రదాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశంలో భిన్న సంస్కృతులు, సంప్రదాయాలు ఉన్నాయన్నారు. భిన్నత్వంలో ఏకత్వం ఉన్న దేశం ప్రపంచంలో భారతదేశం ఒక్కటేనన్నారు. విద్యార్థులు వివిధ సంప్రదాయాలు, సంస్కృతులు ప్రతిబింబించే వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. మెహందీ, వంటలు, రంగవల్లుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కేఈసీ వైస్ ఛైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్, సీఈవో ఎస్.సాగర్‌రాజ్, ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సూర్య,చంద్ర ప్రభ వాహనాలపై వెంకటరమణుడి దివ్యదర్శనం



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

పుంగనూరు రూరల్, మార్చి 23: పుంగనూరు కళ్యాణ వెంకటరమణ స్వామి శనివారం సూర్య, చంద్రప్రభ వాహనాలపై వైభవంగా ఊరేగారు. టీటీడీ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు ఉదయం స్వామివారిని మేల్కొలిపి ప్రత్యేక పూజలు, అలంకరణలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. హోమం, పూర్ణకుంభ హోమాలు నిర్వహించారు. ఉదయం సూర్యప్రభ, సాయంత్రం చంద్రప్రభ వాహనాన సేవలు మంగళవాయిద్యాల నడుమ సాగాయి. భక్తులు మంగళహారతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ జే.మునేంద్ర బాబు, అర్చకులు పృథ్వీరాజ్, శ్రీకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



భద్రప్ప (ఫైల్‌పోటో)

శాంతిపురం, మార్చి 23 : కుప్పం - పలమనేరు జాతీయ రహదారిలోని పోడూరు వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. రాళ్లబూదు గూరు పోలీసుల కథనం మేరకు.. అబకలదొడ్డి పంచాయతీ కోతిగుట్లపల్లె గ్రామానికి చెందిన తిప్పన్న కుమారుడు భద్రప్ప(20) ద్విచక్ర వాహనంలో సొంత పనిమీద కుప్పం వెళ్లాడు. రాత్రి తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా మార్గ మధ్యంలోని పోడూరు వద్ద వీ.కోట నుంచి కుప్పం వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో భద్రప్ప తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అత డిని కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

ఎస్డీపీఐని గెలిపించాలని బైక్‌ర్యాలీ

పుంగనూరు, మా ర్చి 23: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పుంగనూరు నుంచి ఎస్డీపీఐ అభ్య ర్థిగా పోటీ చేస్తున్న కేఎస్.అన్వర్ బాషాను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. శనివారం స్థానిక ఎస్డీపీఐ కార్యాలయం నుంచి ఇందిరా సర్కిల్, పాతబస్టాండ్, ఎన్టీఆర్ సర్కిల్, కొత్తఇండ్లు, కొత్తపేట, భగత్‌సింగ్‌కాలనీ, ఎంబీటీ రోడ్డు, కుమ్మరవీధి, ఎన్ఎస్‌పేటల్లో పార్టీ జెండాలతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్డీపీఐ అభ్యర్థి కేఎస్.అన్వర్‌బాషా, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జమీర్‌లాల్, యూసుఫ్ మాట్లాడుతూ ఆకలి నుంచి స్వేచ్ఛ, భయం నుంచి స్వేచ్ఛ అనే నినాదంతో పోటీలో ఉంటామన్నారు. ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చాంద్‌బాషా, ఫయాజ్, ఇజాస్, ముబారక్, సిద్ధిక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ శివకుమార్

సోమల, మార్చి 23: ఎరువుల దుకాణ డీలర్లు ఎన్నికల కోడ్ నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దుచేస్తామని పుంగనూరు వ్యవసాయశాఖ ఏడీఏ శివకుమార్ హెచ్చ రించారు. శనివారం స్థానిక ఆర్బీకేలో మండల స్థాయి ఎరువు దుకాణ డీలర్లు సమావేశంలో ఆయన మాట్లా డారు. షాపుల వద్ద రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫొటోలు, పోస్టర్లు గానీ ఉండరాదన్నారు. ఎరువు బస్తాలపై పీఎం మోదీ ఫొటో ఉంటే పెయింట్ వేయాల న్నారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ జిన్నా, ఏవో సుధా కర్, శంకర్ నారాయణ, గిరిధర్, వెంకటేశ్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గరుడోత్సవం



శాంతిపురం, మార్చి 23 : మండల పరిధిలోని రాళ్లబూదుగూరు కోదండరామ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. తర్వాత పురోహితులు శాస్త్రోక్తంగా శ్రీదేవి, భూదేవి సమేత కోదండరాముడిని గరుడవాహనంపై అధిరోహింపజేసి గ్రామంలో ఊరేగించారు. భక్తులు భారీగా తరలి వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

రాళ్లబూదుగూరులో కేంద్ర బలగాల కవాతు



శాంతిపురం, మార్చి 23 : మండలం పరిధిలోని రాళ్లబూదుగూరు గ్రామంలో శనివారం కేంద్ర సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. మండలంలోని అత్యంత సున్నితమైన పలు గ్రామాలతో పాటు రాళ్లబూదు గూరులో కవాతు నిర్వహించాయి. ఎన్నికల్లో ప్రజలు తమ ఓటును నిర్భయంగా వినియోగించు కోవాలని కోరారు. ఎన్నికల వేళ గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కుప్పం రూరల్ సీఐ ఈశ్వర్‌రెడ్డి, రాళ్లబూదు గూరు ఎస్ఐ సుమన్, శాంతిపురం తహసీల్దార్, మురళీకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ కొలేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ఆదరించండి

పుంగనూరు రూరల్, మార్చి 23: జరగనున్న ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించి గెలిపించాలని ఆ పార్టీ పుంగనూరు ఇన్‌ఛార్జి రామకృష్ణారెడ్డి కోరారు. శనివారం పుంగనూరులోని నక్కబండ, జగన్‌కాలనీల్లో ఆయన ప్రచారం చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు బుడ్డారెడ్డి, ఎస్.మౌసీనా, శ్రీదేవి, సైదాని తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శనిత్రయోదశి పూజలు



భక్తులతో కిటకిటలాడిన శనేశ్వరాలయం

రామకుప్పం, మార్చి 23 : రామకుప్పం పట్టణ శివార్లలోని శనీశ్వరాల యంలో శనివారం శనిత్రయోదశి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి పంచామృత తైలాభిషేకాలు నిర్వహించి విశేష అలంకరణ చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించు కున్నారు. అదేవిధంగా పక్కనే గల వల్లీదేవసేన సుబ్రహ్మణస్వామి, నాగులమ్మ, పద్మావతి వెంకటశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం చేశారు.

అగ్నికి ఆహుతైన పంట

చౌడేపల్లె, మార్చి23: బోదకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో అవి పక్కనే ఉన్న పంటలకు వ్యాపించి పంట కాలిపోయింది. ఈ ఘటన చౌడేపల్లె మండలంలో శనివారం జరిగింది. బాధితుల కథనం మేరకు.. మండలంలోని బీర్జేపల్లెకు చెందిన పెద్ద రెడ్డెప్ప పొలాల సమీపంలోని బోదకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. అయితే గాలికి ఆ నిప్పు పక్కనే ఉన్న టమోటా, మిరప, మామిడి తోటలకు వ్యాపించింది. రెడ్డెప్ప వెంటనే అగ్నిమాపక అధికారి సుబ్బరాజుకు సమాచారం అందించారు. వారు వచ్చి మంటలు అదుపుచేశారు. అప్పటికే రూ.25వేలు విలువచేసే పంటలు కాలిపోయాయి.

కార్యదర్శి బాధ్యతల స్వీకరణ



సోమల, మార్చి 23: సోమల మండలం పొదలగుం టపల్లె పంచాయతీ కార్యదర్శిగా ఫయాజ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కొన్నేళ్లుగా చిన్న ఉప్పరపల్లె కార్యదర్శి జయశంకర్ ఇక్కడ అదనపు బాధ్యతలు వ్యవహరించే వారు.

జగన్ నాటకాన్ని జనానికి తెలియజేయండి



మాట్లాడుతున్న విశ్వనాథ్‌నాయుడు

శాంతిపురం, మార్చి 23 : రామకుప్పం మండలం రాజపేట వద్ద సీఎం జగన్ హంద్రీ-నీవా కాలువ పేరుతో ఆడిన నాటకాన్ని ప్రజలకు తెలియజేయాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు బాష్యం విశ్వనాథ్‌నాయుడు, మాజీ ఎంపీపీ ఉదయ కుమార్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు విజయ రామిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండల పార్టీ కార్యాలయంలో మండల స్థాయి నేతలు, పంచాయతీ పార్టీ అధ్యక్ష కార్యదర్శుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 25న కుప్పంలో చంద్రబాబు భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. 26న రామకుప్పం మండలం రాజపేట వద్ద సీఎం జగన్ ప్రారంభించిన హంద్రీ-నీవా కాలువను పరిశీలిస్తారని తెలియజేశారు. అక్కడికి ప్రజలు భారీగా తరలివచ్చి జగన్ ఎన్నికల కోసం ఆడిన నాటకాన్ని స్వయంగా చూడాలన్నారు. అందుకు కార్యకర్తలు నాయకులు గ్రామాల్లో తిరిగి బాబు పర్యటనకు ప్రజలు వచ్చేలా చూడాలన్నారు. అలాగే ఎన్నికల ప్రచారంలో అధికారులను పావుగా వాడుకుంటున్నారని అలాంటివి గుర్తించి ఎలక్షన్ కమిషన్ ఇచ్చిన యాప్‌కు పంపాలన్నారు. వలంటీర్లు వైసీపీ ప్రచారంలో రాత్రి పూట పాల్గొంటున్నారని అది కూడా గుర్తించి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. చంద్రబాబుకు లక్ష మెజారిటీ వచ్చేందుకు కష్టపడి పనిచేయాలన్నారు. ఈ కష్టానికి తగిన ఫలితం అధికారంలోకి వచ్చిన తరువాత ఉంటుందని గుర్తించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు చంద్రశేఖర్, మణి, నారాయణస్వామి, నారాయణరెడ్డి, జయరామిరెడ్డి, నాగరాజు, రాజేంద్ర, సుబ్రమణ్యం, రుద్రప్ప, ఏఎంసీ నాగరాజు, కేశవులు, నాగభూషణంరెడ్డి, శ్యామల, రూప, అనుసూయ, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ యువత



అమరనాథరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన పెద్దవెలగటూరు గ్రామస్తులు

పలమనేరు, మార్చి23 : పలమనేరు టీడీపీ కార్యాలయంలో శనివారం మాజీ మంత్రి అమర నాథరెడ్డి సమక్షంలో పలువురు తెలుగుదేశం పార్టీలో చేరారు. పెద్ద పంజాణి మండలం పెద్దవెలగటూరుకు చెందిన వైసీపీ యువత అమరనాథరెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం స్వీకరించారు. వారికి మాజీ మంత్రి అమరనాథరెడ్డి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన సద్దాం హుసేన్, కేశవరెడ్డి, అనిల్‌కుమార్, జగదీష్, మంజునాథ్ తదితరులు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆర్‌వి. బాలాజీ, రామ చంద్రనాయుడు, బ్రహ్మయ్య, పలమనేరు పట్టణ, రూరల్, బైరెడ్డిపల్లి, పెద్దపంజాణి, వి.కోట మండలాల పార్టీ అధ్యక్షులు ఆర్‌బీసీ కుట్టి, నాగరాజరెడ్డి, కిషోర్‌గౌడ్, ఆనంద్, రంగనాథ్, జనసేన నాయకులు హరీష్ దిలీప్, చైతన్య, చందు, శివ, నాగరాజు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

కుప్పం, మార్చి 23: చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. చంద్రబాబు కుప్పం పర్యటన ఈ నెల 25, 26 తేదీల్లో ఖరారైన నేపథ్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ శ్రేణుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు రెండు రోజులపాటు కుప్పంలోనే ఉంటారన్నారు. ఆర్టీసీ బస్టాండు సర్కిల్లో ఈనెల 25న జరగబోయే బహిరంగ సభకు జనాలు భారీగా తరలివచ్చేలా నాయకులు, కార్యకర్తలు గ్రామగ్రామానా విస్తృత ప్రచారం చేయాలని కోరారు. పార్టీ శ్రేణులకు అధినేత దిశానిర్దేశం చేయనున్నారని చెప్పారు. చంద్రబాబుకు లక్ష ఓట్ల మెజారిటీకి తగ్గకుండా పార్టీ శ్రేణులు ఎన్నికల ప్రచారంలో దూసుకుపోవాలని పిలుపునిచ్చారు.

అభివృద్ధి కోసం టీడీపీని ఆదరించండి



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న మునస్వామి తదితరులు

రామకుప్పం, మార్చి 23 : గ్రామాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరగాలంటే ప్రతి ఒక్కరూ టీడీపీని ఆదరించాలని ఆ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నరసింహులు, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి వెంకటాచలం కోరారు. రామకుప్పం మండలం విజలాపురం పార్టీ కార్యాలయంలో వారు శనివారం పార్టీ క్యాలెం డర్లను ఆవిష్కరించారు. ఇంటింటా ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో అభివృద్ధి అటకెక్కింద న్నారు. చంద్రబాబు పరిపాలనా దక్షతతోనే రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందు తుందని, సంక్షేమ ఫలాలు అందరికీ అందుతాయని వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించి భావితరాల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు రామ్మూర్తి, మనోహర్, శ్రీనివాసులురెడ్డి, జయశంకర్, సత్తి, కుమార్, బాబురెడ్డి, మునెప్ప తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటనకు తరలిరండి



గొరివిమాకులపల్లె గ్రామంలో టీడీపీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న ఆనందరెడ్డి

రామకుప్పం, మార్చి 23 : టీడీపీ అధినేత చంద్రబాబు ఈ నెల 25, 26న కుప్పం నియోజక వర్గంలో చేపట్టనున్న పర్యటనను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహులు, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి కోరారు. శనివారం వారు మండలం లోని పలు గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. 25న కుప్పంలో జరిగే బాబు బహిరంగ సభలో పెద్ద సంఖ్యలో టీడీపీ జనసేన, బీజేపీ కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని కోరారు. 26న సాయంత్రం 4:30గంటలకు రాజుపేట హంద్రీ నీవా కాలువను పరిశీలించనున్నారని అక్క డికి వచ్చి జగన్ ఎన్నికల డ్రామాలను తెలుసుకోవాలని కోరారు. ఈ కార్య క్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి వెంకటా చలం, నేతలు మహమ్మద్ రఫీ, గంట్లప్ప, మునిరెడ్డి, మనోహర్, చంద్రకళ, కృష్ణానాయక్, చంద్రశేకర్‌రెడ్డి, పరుశురాం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహారం స్టాల్స్‌ని ప్రదర్శిస్తున్న అంగన్వాడీలు

కల్లూరు, మార్చి 23: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి తెలిపారు. పులిచెర్ల మండలం ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం మండల స్థాయిలో పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులు క్రమం తప్పకుండా పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదల కోసం పౌష్టికాహారం ఉపయోగపడుతుందన్నారు. విటమిన్స్, మినరల్స్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలని తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్స్ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కర్ణ జననం



కల్లూరు, మార్చి 23: పులిచెర్ల మండలం దిగువ పోకలవారిపల్లి పంచా యతీ ఎలకబైలులో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా శని వారం కర్ణ జననం హరికథ భక్తులను ఆకట్టుకుంది. 4వ రోజు హరికథ భాగవతారిణి పూర్ణిమ భక్తులకు అర్థమయ్యే రీతిలో కర్ణ జననం కథను వినిపించారు. అగ్రహారానికి చెందిన వెంకట్రమణరాజు కుటుంబసభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మారథంపై శ్రీవారి అభయం



సోమల, మార్చి 23: మండలంలోని ఆవుల పల్లెలో కొలువుదీరిన ప్రసన్న వెంకటేశ్వ రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో మూల విరాట్‌కు విశేష అలంకరణలు జరిపి అభిషేకపూజలు నిర్వహించారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ పురోహితులు శాస్త్రోక్తంగా హోమాది కార్యక్రమాలు జరిపారు. శ్రీదేవి, భూదేవి శ్రీవారి ఉత్సవ మూర్తులను రథంపై అధిరోహింపజేశారు. బ్రాహ్మణ సంఘ సభ్యులు శాస్త్రోక్తంగా రథానికి పూజలు జరిపారు. అనంతరం భక్తులు పురవీధుల్లో రథాన్ని గోవింద నామస్మరణలతో లాగారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. పెద్దఉప్పరపల్లె, పేటూరు, ఆవులపల్లె, అన్నెమ్మగారి పల్లె పంచాయతీల్లోని వాల్మీకి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహ రించారు.

తాగునీటి సమస్యలపై సర్వే చేయాలి

సోమల, మార్చి 23: మండలంలోని గ్రామాల్లో తాగునీటి పరిస్థితిపై కార్యదర్శులు సర్వేచేయాలని ఎంపీడీవో నారాయణ ఆదేశించారు. శనివారం తన కార్యా లయంలో కార్యదర్శులతో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మంచినీటి పథకాల వివరాలు, తాగునీటి సమస్యలు, ఓవర్‌హెడ్ ట్యాంకుల నీటి సరఫరా అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు అందజేయాలన్నారు. తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సమా వేశంలో ఆర్‌డ బ్ల్యూఎస్ జేఈ అనూష, ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి, కార్య దర్శులు పాల్గొన్నారు.

విధుల నుంచి విద్యుత్ ఈఈ తొలగింపు

తిరుపతి సెంట్రల్, మార్చి 23: ఎస్పీడీసీఎల్ మదనపల్లె ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యుగంధర్‌ను శనివారం విధుల నుంచి తొలగించారు. 2014లో ఆయన విజయవాడ సర్కిల్లో విధులు నిర్వహిస్తుండగా ఏసీబీ దాడులు నిర్వహించింది. అక్రమార్జనకు పాల్పడినట్లు గుర్తించి అరెస్టు చేసింది. ఆ కేసులో ఇటీవల తుదితీర్పు వెలువరించారు. దీంతో ఎస్పీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు ఆయన్ను విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. 33 ఏళ్ల క్రితం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సబ్ ఇంజనీర్‌గా బాధ్యతలు స్వీకరించిన యుగంధర్ గతేడాది పదోన్నతిపై ఈఈగా మదనపల్లె డివిజన్‌కు బదిలీ అయ్యారు. ఏసీబీ కోర్టు ఉత్తర్వులు, ప్రభుత్వ విచారణ అనంతరం విధుల నుంచి తొలగించారు.

కారు ఢీకొని ఒకరి మృతి.. ఇద్దరికి తీవ్రగాయాలు



ఘటనా స్థలంలోనే మృతి చెందిన సామయ్య

గంగవరం,మార్చి 23 : పలమనేరు- మదనపల్లె రహదారిలో కోగిలేరు క్రాస్ వద్ద శనివారం కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. పెద్దపంజాణి మండలం తిప్పిరెడ్డిపల్లెకు చెందిన యానాది సామయ్య, అతని స్నేహితులైన నాగరాజు, లక్ష్మయ్య ద్విచక్రవాహనంపై పలమనేరుకు సొంతపనిపై వచ్చారు. తిరుగుప్రయాణంలో కోగిలేరు క్రాస్ వద్ద మలుపు తిరుగుతుండగా పలమనేరు వైపు అతివేగంగా వస్తున్న కేఏ03ఎన్‌హెచ్1386 నెంబరుగల కారు ఢీకొంది. సామయ్య అక్కడి కక్కడే మృతిచెందాడు. లక్ష్మయ్య, నాగరాజులకు తీవ్రగాయాలయ్యాయి. సీఐ చిన్నగోవిందు, సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన లక్ష్మయ్యను మెరుగైన చికిత్సకోసం చిత్తూరుకు తరలించారు. గంగవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ

పలమనేరు, మార్చి23 : జాతీయ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రి, పత్తికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో క్షయవ్యాధిపై శనివారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. సక్రమంగా మందులు వినియోగిస్తే క్షయ తగ్గిపోతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంవోటీసీ డాక్టర్ మల్లికార్జునరెడ్డి, పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ శారద ఎస్‌టీఎల్ఎస్ ఎం.విజయ కుమార్, ఎస్‌టీఎస్ గౌతమి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్: క్షయవ్యాధి (టీబీ) పట్ల అవగాహన కలిగి ఉండాలని స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రంజిత పేర్కొన్నారు. క్షయ వాధిపై విద్యార్థులు, ఆరోగ్యసిబ్బంది పట్టణంలో అవగాహనా ర్యాలీ, మానవహారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీబీ నివారణకు ప్రభుత్వం ఉచిత వైద్యం అందిస్తోందన్నారు. ● స్థానిక ఏరియా వైద్యశాలలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుసూదన ఆచారి, ఆర్ఎంవో డాక్టర్ హిమశైలజ, టీబీ సూపర్‌వైజర్ సిద్ధార్థరెడ్డి, నాగేనాయక్‌లు ప్రజలకు అవగాహన కల్పించారు.

బైరెడ్డిపల్లె: క్షయవ్యాధి నివారణపై బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద వైద్యాధికారి డాక్టర్ విజయచందర్ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది పలువురికి అవగాహన కల్పించారు. క్షయ వ్యాప్తి, నివారణ చర్యల గురించి వైద్యాధికారి తెలియజేశారు. వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉన్నవారికి, పోషకాహారలోపం గలవారికి, దీర్ఘకాలికవ్యాధిగ్రస్తులకు, వృద్ధులకు, పొగ తాగేవారికి క్షయ ఎక్కువగా వచ్చే అవకాశంవుందని తెలియజేశారు. అందువల్ల ముందు జాగ్రత్తగా పుట్టిన పిల్లలకు టీకాలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో అనురాధ, ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.





పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ప్రారంభించిన ర్యాలీ, పుంగనూరులో ర్యాలీ చేపట్టిన విద్యార్థులు, వైద్య సిబ్బంది

వైభవంగా రథోత్సవం

● స్వర్ణ రథంపై కరకంఠేశ్వరుడి విహారం



రథాన్ని లాగుతున్న భక్తులు

నగరి, మార్చి 23: నగరి పట్టణ పరిధిలోని కామాక్షి సమేత కరకంఠేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న పంగుణోత్తర బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజైన శనివారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రథంపై స్వామి అమ్మవార్లను అధిష్ఠింపజేసి ఆలయ నిర్వాహకులు ముందుకు లాగి రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగుతూ హర హర అంటూ నామ స్మరణ చేయడంతో మాడవీధులు మార్మోగాయి. రథంపై మాడవీధుల్లోకి రాగా ప్రతి ఇంటి వద్ద భక్తులు స్వామి అమ్మవార్లకు కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులిచ్చారు. మంగళవాయిద్యాలు, శివపురాణ పఠనం భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రథం విరాళదాతలు కోనేరు అమృతమ్మ, సుబ్రమణ్య మొదలియార్, ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం, భక్తులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా జరిపించడానికే కవాతు



కవాతులో పాల్గొన్న పోలీసులు, కేంద్ర బలగాలు

చిత్తూరు, మార్చి 23: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శనివారం డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో చిత్తూరు 1, 2 పట్టణ సీఐలు విశ్వనాథరెడ్డి, ఉలసయ్య కేంద్ర సాయుధ బలగాల కవాతును నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు కాలనీల్లో కవాతు కొనసాగింది. చిత్తూరు నగర పాలక పరిధిలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగడానికి, ప్రజలకు అవగాహన కల్పించడానికే కవాతు నిర్వహించినట్లు డీఎస్పీ తెలిపారు. ప్రజలు భయాందోళనలకు గురికాకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

రాష్ట్రాభివృద్ధి కోసం కూటమికి ఓటెయ్యండి



చింతలగుంటలో ప్రచారం చేస్తున్న ప్రతిమ తదితరులు

చిత్తూరు రూరల్, మార్చి 23: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి అభ్యర్థులకు ఓటెయ్యాలని చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ సతీమణి ప్రతిమ కోరారు. శనివారం చిత్తూరు రూరల్ మండలంలోని తాళంబేడు, చింతలగుంట పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ చంద్రబాబు సీఎం అయితేనే సూపర్ సిక్స్ పథకాలు అమలవుతాయని చెప్పారు. చిత్తూరును స్మార్ట్ సిటీగా మార్చాలంటే గురజాల జగన్మోహన్‌ను అఖండ మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోహన్‌రాజ్, శశికర్‌బాబు, మేషాక్, అరుణ, రాజా, మోహన్, మదన, మణి, రమేష్, నాగలక్ష్మి, రేవతి, లత, నగరాజ్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సారా, నాటు తుపాకీ స్వాధీనం

- ఒకరి అరెస్టు

వెదురుకుప్పం, మార్చి 23: ఐదు లీటర్ల సారా, నాటు తుపాకీని స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు కార్వేటినగరం ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు. వివరాలు ఇలా... వెదురుకుప్పం మండలం బాలుపల్లికి చెందిన మునిరెడ్డి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఇల్లు నిర్మించుకుని ఉంటున్నాడు. అక్కడ సారా తయారీ చేస్తుండగా శుక్రవారం సాయంత్రం దాడి జరిపి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. అలాగే ఇంటి వెనుక నాటు తుపాకీ ఉండగా దాన్ని స్వాధీనం చేసుకుని, మునిరెడ్డిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడిపై వెదురుకుప్పం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసి, శనివారం రిమాండుకు తరలించామని చెప్పారు.

విద్యుత్ వైర్లు చోరీ

పూతలపట్టు, మార్చి 23: మండలంలో గత రెండు మూడు రోజులుగా పలుచోట్ల విద్యుత్ వైర్లు చోరీకి గురవుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి సంజీవరాయనిపల్లి, చిటిపిరాళ్ల గ్రామాలకు చెందిన పలువురు రైతుల వ్యవసాయ బావుల వద్ద ఉన్న బోరు మోటరుకు అమర్చిన రాగివైర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ.2 లక్షల పైనే ఉంటుందని బాధితులు శనివారం సీఐ సుదర్శన్ ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు.

నేడు టౌన్ బ్యాంకు మహాజనసభ

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 23: చిత్తూరు కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు మహాజనసభ ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక గిరింపేట బ్యాంకు భవనంలో జరుగుతుందని ఆ బ్యాంకు సీఈవో దొరైస్వామి శ్రీనివాసన్ తెలిపారు. బ్యాంకు ఛైర్మన్ రామగణేష్ అధ్యక్షతన జరిగే మహాజనసభకు ఏ క్లాస్ తరగతి సభ్యులు, డిపాజిట్ హోల్డర్లు, బ్యాంకు జారి చేసిన గుర్తింపుకార్డు లేదా ఆధార్‌కార్డుతో హాజరుకావాలని పేర్కొన్నారు. 2023-24 అర్ధ సంవత్సరపు బ్యాంకు పరిపాలన నివేదిక ఆమోదం, ఆస్తులు, అప్పుల పట్టిక, లాభనష్టాల పట్టికను సమావేశంలో ఆమోదించనున్నట్లు చెప్పారు. సభ్యులందరూ హాజరవ్వాలని ఆయన కోరారు.

ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్

పూతలపట్టు, మార్చి 23: ఆటోడ్రైవర్లు తమ వాహనాలను ఎక్కడపడితే అక్కడ ఆపరాదని పూతలపట్టు సీఐ సుదర్శన్ ప్రసాద్ హెచ్చరించారు. శనివారం సాయంత్రం ఆయన మండలంలోని ఆటోడ్రైవర్లను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు నిలుచున్న చోట వారికి ఇబ్బంది కలిగించే విధంగా ఆటోలు నిలుపరాదన్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలిగించే ఆటోడ్రైవర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పీవీకేఎన్‌లో యోగా కోర్సులు ప్రారంభం

చిత్తూరు (సెంట్రల్), మార్చి 23: స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024 ఏప్రిల్ నుంచి యోగా సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జీవనజ్యోతి తెలిపారు. సర్టిఫికెట్ కోర్సుతో పాటు డిప్లొమా కోర్సులు ఉంటాయన్నారు. టెన్త్ విద్యార్హతతో డిప్లొమా కోర్సులో చేరవచ్చునని సూచించారు. సర్టిఫికెట్ కోర్స్ వ్యవధి ఆరు నెలలు కాగా, డిప్లొమా కోర్స్ ఏడాది పాటు ఉంటుందన్నారు. సర్టిఫికెట్ కోర్సులో 16-45 మధ్య వయస్సు కలిగిన వారు, డిప్లొమా కోర్సులో 18-45 వయస్సు కలిగిన వారు అర్హులని తెలిపారు. ఈనెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చునని, ఇతర వివరాలకు 91824 20973 నెంబరులో సంప్రదించాలని తెలిపారు.

తూతూమంత్రంగా వాహనాల తనిఖీ



చెక్‌పోస్టు వద్ద సిబ్బంది లేని దృశ్యం

బంగారుపాళ్యం, మార్చి 23: ఎన్నికల కోడ్ అమలుకావడంతో మద్యం, నగదు అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసులు బంగారుపాళ్యం మండలం కొదలమడుగు గ్రామం వద్ద తమిళనాడు - ఆంధ్ర సరిహద్దు పరిధిలో చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. నిత్యం తనిఖీలు నిర్వహించాల్సిన పోలీసులు సాయంత్రం 5 గంటలకంతా చెక్‌పోస్టుకు తాళాలు వేసి ఎవరిదారిన వారు వెళ్లిపోతున్నారు. అక్రమ రవాణా దారులు ఈ చెక్‌పోస్టు గుండా తమిళనాడు నుంచి నగదు, మద్యం తరలించే అవకాశం ఉంది. కొదలమడుగు చెక్‌పోస్టు వద్దకు శనివారం సాయంత్రం ఆంధ్రజ్యోతి సిబ్బంది వెళ్లగా చెక్‌పోస్టుకు తాటికాయంతా తాళాలు వేసి వెళ్లిపోవడం గమనార్హం. గ్రామస్తులు చెక్‌పోస్టు వద్ద కూర్చొని వుండగా, వారిని పలుకరించగా... గత వారం రోజులుగా పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారని, సాయంత్రం 5 గంటలకే వెళ్లిపోతున్నారని చెప్పుకొచ్చారు.

విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి ఎదగాలి

● వేము కళాశాల ఛైర్మన్ చంద్రశేఖర్ నాయుడు



సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

పూతలపట్టు, మార్చి 23: విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని వేము ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ చంద్రశేఖర్ నాయుడు కోరారు. శనివారం కళాశాల ఆవరణంలో ప్రజ్ఞ 2కే24 కార్యక్రమం జరిగింది. అనంతరం 90శాతం పైగా మార్కులు సాధించిన 20 మంది విద్యార్థుల్లో ఒక్కొక్కరికీ రూ.15వేలు నుంచి రూ.20 వేల వరకు నగదు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూ అనంతపూర్ సివిల్ ఇంజనీర్ డాక్టర్ సుధాకర్, అమరరాజా కంపెనీ జనరల్ మేనేజర్ సెంథిల్ కుమార్, కళాశాల ప్రిన్సిపల్ నవీన్ కిల్లారితో పాటు పలువురు సైంటిస్టులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కళాశాల ఆవరణలో డీజే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థినుల ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటేషన్, కాళికా మాత వేషధారణలో చేసిన నృత్యం అందరినీ అలరించింది.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు: కమిషనర్



ఎన్టీయార్ జలాశయాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు, మార్చి 23: వేసవి నేపథ్యంలో నగరంలో తాగునీటి తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కమిషనర్ అరుణ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం వేసవిలో తాగునీటి సమస్యను ఎదుర్కోవడంపై నగరపాలక కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులు, వార్డు అమినిటీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా నీటిని సరఫరా చేయడానికి అవసరమైన యాక్షన్‌ప్లాన్‌ను సిద్ధం చేయాలన్నారు. కల్వకుంట జలాశయం, బోర్ల ద్వారానే నగరానికి నీరు సరఫరా అవుతోందన్నారు. అమినిటీ కార్యదర్శులు వారి వారి పరిధిలో బోర్లను పరిశీలించి వస్తున్న నీరు ఎన్ని కుటుంబాలకు సరిపోతుందన్న విషయాన్ని నివేదిక రూపంలో తయారు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంఈ గోమతి, డీఈలు వెంకటప్రసాద్, రమణ, అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు. నగర శివారులో ఉన్న కల్వకుంట జలాశయాన్ని కమిషనర్ అరుణ శనివారం పరిశీలించారు. జలాశయంలో ప్రస్తుతం 88 ఎంసీఎఫ్టీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

నేడు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవం

గుడిపాల, మార్చి 23: మండలంలోని కందగిరికొండపై వెలసిన వళ్లీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం 9 గంటలకు కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ సుబ్రహ్మణ్యం నాయుడు, పాలకవర్గ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం గిరిప్రదక్షిణ ఉంటుందని, భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

మీ ఓటు.. మా భవిష్యత్తు

● విద్యార్థినులచే వినూత్న ప్రచారం



ఇంగ్లీషు అక్షరాలతో ఓట్ ఆకారంలో కూర్చొన్న విద్యార్థినులు

చిత్తూరు, మార్చి 23: చిత్తూరు నగరపాలక కమిషనర్ అరుణ ఆధ్వర్యంలో మీ ఓటు.. మా భవిష్యత్తు అంటూ శనివారం విద్యార్థినులు వినూత్నంగా ప్రచారాన్ని నిర్వహించారు. ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కస్తూర్బా ఉన్నత పాఠశాల విద్యార్థినులచే ఇంగ్లీషు అక్షరాలతో ఓటు ఆకారంలో ప్రదర్శన నిర్వహించారు. 18సంవత్సరాలు నిండిన వారంతా ఓటు హక్కును వినియోగించుకోవాలని నోడల్ అధికారి చిన్నయ్య తెలిపారు.

సూపర్‌సిక్స్ కరపత్రాల పంపిణీ



విజయపురం, మార్చి 23: మండలంలోని కేవీపురంలో శనివారం బాబు సూపర్ సిక్స్ కరపత్రాలను టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. టీడీపీని ఆదరించి రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబును సీఎం చేయాలని ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబు యాదవ్, తెలుగు మహిళా అధ్యక్షురాలు గుణభూషణమ్మ, నాయకులు వేణుగోపాల్ నాయుడు, పురుషోత్తం, దశరథరాజు, సుధాకర్‌రాజు, మధు నాయుడు, జీవరత్నం నాయుడు, ఢిల్లీ నాయుడు, శివయ్య నాయుడు, పరంధామ నాయుడు, గుణశేఖర్‌రెడ్డి, కపిల్, బెంజిమన్ తదితరులు పాల్గొన్నారు.

'వలంటీర్లను సస్పెండ్ చేస్తే ఎలా... కేసు పెట్టాలి కదా'

గుడిపాల, మార్చి 23: ఎన్నికల ప్రచారంలో కొంత మంది వలంటీర్లు పాల్గొనడంతో వారిని సస్పెండ్ చేస్తున్నారే తప్ప కేసులు పెట్టకుండా వదిలేస్తున్నారని మాజీ జడ్పీటీసీ బాలాజి నాయుడు, మండల టీడీపీ ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్ అన్నారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ఎన్నికల ప్రచారంలో కొంత మంది వలంటీర్లు, సంఘమిత్రలు పాల్గొనగా, వారిని సస్పెన్షన్లకే పరిమితం చేస్తున్నారని, ఈసీ ఆదేశాల మేరకు కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు చిత్తపార నాగరాజ యాదవ్ పాల్గొన్నారు.



టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్‌ను చిత్తూరులో శనివారం కలిసి మద్దతు తెలుపుతున్న సావర్కర్ ట్రస్టు అధ్యక్షుడు దేవరాజన్



శోభాయమానంగా

సూర్య, చంద్ర ప్రభ వాహన సేవలు

చిత్తూరు కల్చరల్, మార్చి 23: నగరంలోని ప్రముఖ శైవక్షేత్రం కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వరాలయ పంగుణి మాస వార్షిక బ్రహ్మోత్సవాలు గత 10 రోజులుగా నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం జమున బాలాజి సింగ్, మణి సాహితి గణేశ్, గణేశ్‌సింగ్, కరుణీవీర్, ఠాకూర్‌ల ఉభయంతో స్వామి అమ్మవార్లకు సూర్యప్రభ, సాయంత్రం చిత్తూరు రజక సంఘం ఆధ్వర్యంలో చంద్రప్రభ వాహన సేవలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు శివాచార్యులు స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ నిర్వాహకులు శివప్రసాద్, కాళభైరవ ట్రస్టు వ్యవస్థాపకులు టి. వెంకటేషన్, చాణక్య రవి, విజయలక్ష్మి బాబు, భక్తులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఆదివారం స్వామివారికి నటరాజ ఉత్సవం, ఉత్సవాల ముగింపు సందర్భంగా ధ్వజావరోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఉత్సవ నిర్వాహకులు శివప్రసాద్ తెలియజేశారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

విజయపురం, మార్చి 23: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని సీడీపీవో కృష్ణవేణి పేర్కొన్నారు. శనివారం మండలంలోని విజయపురం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి గర్భిణి తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి, కార్యకర్తలు హైమావతి, విజయ, రాధిక, విక్టరీ తదితరులు పాల్గొన్నారు.

సమతుల ఆహారం తీసుకోవాలి

నగరి, మార్చి 23: నగరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సత్రవాడ, వినాయకపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాన్ని సీడీపీఓ కృష్ణవేణి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన తల్లులతో సీడీపీఓ మాట్లాడుతూ ప్రతి నిత్యం సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. విటమిన్‌లు, మినరల్స్ అధికంగా ఉండే పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శంకరమ్మ, సిబ్బంది గోపి, ఏఎన్ఎం సొక్కు, సుభాషిణి, శైలజ, గీత, రమ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత స్థితికి ఎదగాలంటే అహాన్ని విడనాడాలి



ప్రసంగిస్తున్న చైతన్యలక్ష్మి

తవణంపల్లె, మార్చి 23: జీవితంలో ఉన్నత స్థితికి ఎదగాలంటే అహాన్ని విడనాడాలని సీనియర్ పిరమిడ్ మాస్టరు చైతన్యలక్ష్మి ఉద్బోధించారు. మండలంలోని కాణిపాకం క్రాస్ సమీపంలోని సిద్ధంపల్లె వద్ద గల శ్రీవిఘ్నేశ్వర మహా పిరమిడ్ జ్ఞాన క్షేత్రంలో జరుగుతున్న ధ్యాన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ ధ్యానంపై నమ్మకం, విశ్వాసం, క్షమాగుణం, ప్రేమ తత్వం, దాన గుణం ఉంటే మానవుడు మాధవుడుగా ఎదిగే అర్హతను పొందగలడన్నారు. భగవంతుడు తనలోనే ఉన్నాడనే సత్యాన్ని గ్రహించలేక పోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ వ్యవస్థాపకులు గోపాలకృష్ణమూర్తి, కన్వీనర్ రాధిక, ధ్యానులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా...?

గుడిపాల, మార్చి 23: రోడ్డు గుంతలమయంగా మారి ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా అని రామభద్రాపురం సర్పంచ్ గోళ్ల హరిణి హేమాద్రి నాయుడు, దాయంవారిపల్లె, గాండ్లపల్లి, రామభద్రాపురం గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ కొత్తపల్లి నుంచి వయా రామభద్రాపురం మీదుగా దాయంవారిపల్లెకు వెళ్లే రోడ్డులో ఓ ప్రైవేటు సంస్థ ఓవర్‌లోడ్లతో మన్ను తోలి బాగున్న రోడ్లను నాశనం చేశారన్నారు. ఇదేమని అడిగితే పనులు అయిన తర్వాత మీకు రోడ్డు వేయిస్తామని చెప్పి లిఖితపూర్వకంగా ఆ ప్రైవేటు సంస్థవారు రాసిచ్చి, మూడునెలలు పూర్తవుతున్నా, మరలా 15 రోజులు సమయం ఇవ్వాలని అడుగుతున్నారన్నారు. ఇప్పటికే ఈ రహదారిలో గాండ్లపల్లె సమీపంలో రాత్రివేళల్లో పలువురు పడిలేచి గాయాల పాలైన సంఘటనలు మెండుగా ఉన్నాయన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

చెట్టును ఢీకొన్న స్కూల్ బస్సు

● ఐదుగురు విద్యార్థులకు స్వల్ప గాయాలు



చెట్టును ఢీకొన్న స్కూల్ బస్సు

శ్రీరంగరాజపురం, మార్చి 23: స్కూల్ బస్సు అదుపు తప్పి చెట్టును ఢీకొని ఐదుగురు విద్యార్థులు గాయపడిన సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు ఎస్ఆర్‌పురం మండలం, నెలవాయి పరిధిలో ఉన్న ఇండో జర్మన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులను ఇంటి దగ్గర వదలడానికి, స్కూల్ నుంచి బస్సులో తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో ముద్దికుప్పం వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి సమీపంలో ఉన్న టెంకాయ చెట్టును ఢీకొనడంతో ఐదుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఎస్ఆర్‌పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

పేదలకు అన్నదానం

పూతలపట్టు, మార్చి 23: మండల కేంద్రంలోని అన్న క్యాంటీన్‌లో శనివారం పంటపల్లి గ్రామస్తులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండల టీడీపీ కన్వీనర్ దొరబాబు చౌదరి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి యువరాజులు నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారుపాళ్యంలో...

బంగారుపాళ్యం, మార్చి 23: మండల కేంద్రంలోని బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద శనివారం జరిగిన అన్నదాన కార్యక్రమానికి శేషాపురం గ్రామానికి చెందిన హేమచంద్ర నాయుడు భోజనం వితరణ చేశారు. జనార్దన్ గౌడ్, గిరిబాబు, సూరి నాయుడు, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయం వద్ద అన్నదానం

కార్వేటినగరం, మార్చి 23: స్థానిక టీటీడీ వేణుగోపాలస్వామి ఆలయం వద్ద శనివారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి హానికరం



ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించిన పీవీకేఎన్ విద్యార్థులు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 23: ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి హాని కలిగిస్తాయని పీవీకేఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జీవనజ్యోతి పేర్కొన్నారు. ప్రపంచ వాతావరణ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక పీవీకేఎన్ కళాశాలలోని ఎన్‌సీసీ క్యాడెట్లు ఎర్త్ అవర్‌పై ప్రతిజ్ఞ చేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం ద్వారా అడవులు నరికివేతకు గురవుతున్నాయని, ఇది ప్రత్యక్షంగా పర్యావరణానికి హాని కలిగించడమేనని చెప్పారు. ఎన్‌సీసీ విద్యార్థులు ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. అధ్యాపకులు రమేష్, హరిప్రసాద్, భానుప్రసాద్, మీరా సాహెబ్ పాల్గొన్నారు.

విధుల నుంచి విద్యుత్ ఈఈ తొలగింపు

తిరుపతి సెంట్రల్, మార్చి 23: ఎస్పీడీసీఎల్ మదనపల్లె ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యుగంధర్‌ను శనివారం విధుల నుంచి తొలగించారు. 2014లో ఆయన విజయవాడ సర్కిల్లో విధులు నిర్వహిస్తుండగా ఏసీబీ దాడులు నిర్వహించింది. అక్రమార్జనకు పాల్పడినట్లు గుర్తించి అరెస్టు చేసింది. ఆ కేసులో ఇటీవల తుదితీర్పు వెలువరించారు.దీంతో ఎస్పీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు ఆయన్ను విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. 33 ఏళ్ల క్రితం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సబ్ ఇంజనీర్‌గా బాధ్యతలు స్వీకరించిన యుగంధర్ గతేడాది పదోన్నతిపై ఈఈగా మదనపల్లె డివిజన్‌కు బదిలీ అయ్యారు. ఏసీబీ కోర్టు ఉత్తర్వులు, ప్రభుత్వ విచారణ అనంతరం విధుల నుంచి తొలగించారు.